క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి ఫలయాగం



తిరువూరు: స్థానిక రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఫల యాగం నిర్వహించారు. స్వామికి, గోదాదేవికి వివిధ రకాల పండ్లతో అలంకరించి విశేషార్చన చేశారు. తిరుప్పావై పఠన కార్యక్రమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయంలో 108 దివ్యదేశాల పూజ కార్యక్రమం జరిపారు. పలు నదులలో సేకరించిన జలాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు పర్యవేక్షించారు.

గంటిపాడు తండా వాసికి డాక్టరేట్



చాట్రాయి: మండలంలోని గంటిపాడు తండాకు చెందిన బాణావతు రాజేంద్రప్రసాదు డాక్టరేట్ పొందారు. రాజేంద్ర ప్రసాదు ఎన్టీఆర్ జిల్లా మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో అన్సాంపుల్ లెర్నింగ్ మోడల్ ఫర్ ప్రొడక్షన్ ఆఫ్ షోల్డర్ ఇంప్లాట్ మాన్యుఫ్యాక్చర్ యూజింగ్ ఎక్స్‌రే -ఇమేజెస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్రా యూనివర్సిటీ పీహెచ్‌డీని ఇటీవల ప్రదానం చేసింది. ఇందుకు గానూ పరిశోధన ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ పర్యవేక్షణలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన లంబాడీ సంఘ నాయకులు మంగయ్య, పాంచాలి, శంకరం, పేరయ్య అభినందనలు తెలిపారు.


రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం స్వాధీనం

ఇబ్రహీంపట్నం: పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. కంచికచర్ల వైపు నుంచి వస్తున్న మినీ వాహనంలో సుమారు మూడు టన్నుల పీడీఎస్ బియ్యం మూటలు కనుగొన్నారు. బియ్యం తాలూకా రికార్డులు లేవని గుర్తించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. కేసు నమోదుచేసి బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

10న మండల స్థాయి పోటీలు

గంపలగూడెం: మండలంలో సచివాలయ స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయని ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో ఐదు క్రీడల్లో ఎంపికైన టీములకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయిలో గెలిచినటువంటి టీములు తిరువూరు నియోజకవర్గ స్థాయి ఆడేందుకు అర్హత సాధిస్తాయని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం వృద్ధుల సంక్షేమానికి నిరంతరం పాటు పడాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బీఎం సింగ్, ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, కోశాధికారి ఏయూఎం దిలీప్, సభ్యులు పలగాని పిచ్చయ్య, వై.ఉయ్యూరు కుమార్, పర్వతనేని మాధవరావు, యడవల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

బీసీ సంఘం వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా చింతగుంట్ల



చాట్రాయి: బీసీ సంఘం వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన చింతగుంట్ల వెంకటేశ్వరావును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని గురువారం అందుకున్నారు.

హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే



రెడ్డిగూడెంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



చాట్రాయిలో పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

రెడ్డిగూడెం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన రూ. 3వేల పింఛన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు ముడుపులు ఇవ్వలేక అర్హత ఉండి కూడా పింఛన్ అందని వారు చాలా మంది ఉండేవారన్నారు. నేడు పారదర్శకంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ అందజేసే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని తెలిపారు. పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్యశ్రీ రూ. 5లక్షల నుంచి రూ. 25లక్షల వరకు పరిమితిని పెంచారన్నారు. కార్యక్రమంలో మైలవరం మార్కెట్‌యార్డు చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి, ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య, రెడ్డిగూడెం మండల సచివాలయ కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బలగాని తిరుపతిరావు, వైస్ ఎంపీపీ రాబర్ట్స్, సొసైటీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి, రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణీ, ఎంపీడీఓ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్లో పొందుపరచిన విధంగా పథకాలు అమలు

చాట్రాయి: విడతల వారీగా పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. చాట్రాయిలో పెంచిన పింఛన్లను శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాజీ పడకుండా సంక్షేమ క్యాలెండర్లో పొందుపరిచిన విధంగా తంచన్‌గా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ల కోసం ఎదురు చూపులు చూస్తూ చెట్ల కింద పడిగాపులు పడేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే తలుపు కొట్టి పెన్షన్లను అందజేస్తున్నారని తెలిపారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఈ పథకాలు రద్దు చేస్తారన్నారు. అందుకని మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ముందుగా మృతి చెందిన తహసీల్దార్ విశ్వనాథరావుకు సభ మౌనం పాటించింది. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జీ, ప్రసాదుబాబు, వాసు, బాలకృష్ణ, చెన్నారావు, అప్పిరెడ్డి, నాగేశ్వరావు, శ్రీనివాసరావు, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.



ఎ.కొండూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీడీఓ రవికాంత్

ఎ.కొండూరులో..

ఏ.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రూ. 3వేలకు పెంచిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవికాంత్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల నాయకులు కాలసాని చెన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు పుల్లారావు, వైఎస్సార్ సీపీ నాయకులు డి.సతీష్, బి.నాగకృష్ణ, ఎం.సాంబయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.



నూజివీడులో పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటరావు

శరవేగంగా పింఛన్ల పంపిణీ

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలో శుక్రవారం పింఛన్ల పంపిణీని వలంటీర్లు శరవేగంగా నిర్వహించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా వలంటీర్లు పింఛన్లను పింఛన్‌దారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నారు. ఈనెల నుంచి ప్రభుత్వం పింఛన్ల నగదును రూ.2,750నుంచి రూ.3వేలకు పెంచడంతో పెంచిన నగదును వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛన్ నగదును అందజేశారు. దీంతో శుక్రవారం నాటికి నూజివీడు మండలంలో 95 శాతం, నూజివీడు పట్టణంలో 85 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ పేదలకు గొప్ప వరం

జి.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలపాలిట వరంగా మారిందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని చెవుటూరులో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలతో పాటు వైద్యాన్ని ఇంటి వద్దకే చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదని కొనియాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25లక్షలకు పెంచి రాష్ట్ర ప్రజల సంక్షేమంపై ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. అంతే కాకుండా కరోనా లాంటి మహా విపత్తును సైతం ఎదుర్కొని వందశాతం హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రిదని పేర్కొన్నారు.

ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం

ఆగిరిపల్లి: పేదల ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం అందించాలని లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం చేపట్టడం జరిగిందని జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు తెలిపారు. నెక్కలం గొల్లగూడెంలో ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. 520 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశామని మెడికల్ ఆఫీసర్ జాస్తి జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చా హరిబాబు, ఎంపీడీఓ శంకరరావు, నాయకులు గోళ్ల ఇస్సాకు, సర్పంచులు లింగవరపు రమేష్, మేము రాజు, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పుల్లారావు పాల్గొన్నారు.

2,200 మందికి వైద్య సేవలు

గోసవీడు(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమంలో భాగంగా గోసవీడులో శుక్రవారం ప్రత్యేక వైద్యక శిబిరం నిర్వహించారు. శిబిరంలో 2,200 మందికి వైద్యులు పరీక్షలు చేసినట్లు గంపలగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శృతి తెలిపారు. శిబిరంలో గైనకాలజిస్టు ప్రియాంక, ఆప్తమాలజిస్ట్ శోభారాణి, వైద్యులు శృతి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచ్ కందిమల్ల ప్రశాంత్, ఎంపీటీసీ సభ్యురాలు బి.జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, కోటిరెడ్డి, రత్నం పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు

నరసాపురం (విస్సన్నపేట): పేదలకు వారి గ్రామంలోనే ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయం-1 పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, వైద్యాధికారి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సురేష్, పాఠశాల హెచ్‌ఎం శోభాలత, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష మందుల కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



నరసాపురంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, ఎంపీడీఓ వెంకటరమణ



నెక్కలం గొల్లగూడెంలో మందుల కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు



గోసవీడులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

రైతుబజారు భవన నిర్మాణాలకు శంకుస్థాపన



రైతు బజారు నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వసంత

మైలవరం: మైలవరంలోని రైతు బజారులో రూ.77.5 లక్షలతో నిర్మించనున్న నూతన షాపుల సముదాయానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. మైలవరం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల బహిరంగ ప్రజా ప్రయోజనాల కోసం, ఇటు రైతులకు, అటు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా రైతుబజారు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. .

కొత్తమంగాపురం గ్రామంలో..

కొత్తమంగాపురం(మైలవరం): మైలవరం నియోజకవర్గ పరిధిలోని కొత్త మంగాపురం గ్రామంలో నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. 500మీటర్ల పొడవునా ఐకే రోడ్డు(ఇబ్రహీంపట్నం-కొండూరు) నుంచి రుద్రవరం వరకు వయా కొత్త మంగాపురం మీదుగా సిమెంట్ రహదారి నిర్మించనున్నారు. దీనికి రహదారులు, భవనములశాఖ నుంచి క్యాపిటల్ గ్రాంట్ నిధులు రూ.100 లక్షలు మంజూరయ్యాయి. సిమెంట్ రహదారి పనులకు త్వరగా పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

కోలాహలంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు



మీర్జాపురంలో క్రికెట్ ఆడేందుకు టాస్ వేస్తున్న అధికారులు

నూజివీడు: గత నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంతో పాటు పట్టణంలోనూ కోలాహలంగా కొనసాగుతున్నాయి. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహిస్తుండగా ఈ పోటీల్లో 15 సంవత్సరాల పైబడి వయస్సున్న యువతీ యువకులు పాల్గొని తమ సత్తాను చాటుతున్నారు. సచివాలయ స్థాయిలో పోటీలను నిర్వహించేందుకు మండలంలోని పల్లెర్లమూడి, యనమదల, పడమర దిగవల్లి, మీర్జాపురం హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన కోర్టులందు పోటీలను నిర్వహిస్తున్నారు. పట్టణంలో ఎస్ఆర్ఆర్ హైస్కూల్, ధర్మ అప్పారావు కళాశాల, సెయింట్ థామస్ హైస్కూళ్లలో పోటీలు నిర్వహిస్తున్నారు. మీర్జాపురం హైస్కూల్ ఆట స్థలంలో శుక్రవారం క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రారంభించారు. పోటీలను పీడీలు స్వప్న, పి.రవీంద్ర నిర్వహించారు. ఈనెల 6తో సచివాలయ స్థాయి పోటీలు ముగియనున్నాయి. 10 నుంచి మండల స్థాయిలో ఆటల పోటీలు ప్రారంభం కానున్నాయి.

డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్ డీసీ) ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎస్‌సీ, 10ప్లస్ 2, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రత్యేకంగా రెండు నెలల పాటు ఉచిత శిక్షణ కోసం ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు డేటా ఎంట్రీ కోర్సులో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీ నరేష్‌కుమార్ తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కఠోర శ్రమతోనే విజయం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పటమట(విజయవాడతూర్పు): పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు రోజూ దినపత్రికల్లో వచ్చే కరెంట్ ఎఫైర్స్‌ను పరిశీలించాలని, దీనికి కఠోర శ్రమ తోడైతేనే విజయాన్ని సాధిస్తారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పటమటలోని సర్వోత్తమ గ్రంథాలయంలో గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపజయం విజయానికి దారి తీస్తుందని, సిలబస్, ప్రశ్నల సరళితో పాటు గతంలో జరిగిన పేపర్లు క్షుణ్ణంగా అవగాహన చేసుకుని నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలన్నారు. హిస్టరీ, జాగ్రఫీ, భారత సమాజం, కరెంట్ ఎఫైర్స్‌తోపాటు మెంటల్ ఎబిలిటీ అంశాల్లో 30 మా ర్కులు చొప్పున 150 ప్రశ్నలుంటాయన్నారు. 90 మార్కులకు పైన సాధిస్తేనే మెయిన్స్‌కు అర్హత సాధిస్తామని తెలిపారు. అందులో 300 మార్కులు ఉంటాయని, వాటిలో ప్రధానంగా ఆంధ్రుల చరిత్ర, ఇండియన్ పాలిటీ, భారత-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ శాస్త్రాలతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో నాలుగు పేపర్లు ఉంటాయన్నారు. ఒక్కో దానికి 75 మార్కుల చొప్పున ప్రశ్నలుంటాయని తెలి పారు.ప్రిలిమ్స్, మెయిన్స్ సిలబస్‌తోపాటు పరీక్షల కు ఇస్తున్న ప్రశ్నావళిపై అవగాహన పెంచుకోవాల న్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్య వస్థ లపై ఆయన రచించిన పుస్తకాలను పంపిణీ చేశారు.

నేడు చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

నూజివీడు: పట్టణంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నూజివీడు చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు ఏపీఎం దయాల రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, జిల్లా కలెక్టర్ వై ప్రసన్న వెంకటేష్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

గంపలగూడెం: పెంచిన పింఛన్ నగదును లబ్ధిదారులకు గంపలగూడెంలో శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే కార్యక్రమంలో పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ వరకు మండలంలో 11,608 మంది పింఛన్‌దారులుండగా ఈనెల నుంచి 139 మంది కొత్తవారితో కలిపి, 11,747 మంది లబ్ధిదారులకు పెరిగిన పింఛన్‌ను అందజేయనున్నట్లు తెలిపారు.


ముసునూరులో..

ముసునూరు: మండల వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్‌దారులతో పాటు నూతనంగా మంజూరైన 106 మందికి శనివారం పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. శుక్రవారం ఆమె వివరాలు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ సంబరాల్లో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్‌సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి ఆధారిత విదేశీ భాష స్పానిష్ సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. స్పానిష్ భాష సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల మూడోవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నా రు. సమాచారం కోసం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ విభాగంలో స్వయంగా కానీ, 81439 29613లో సంప్రదించాలని కోరారు.

గాయకుల ప్రతిభను ప్రోత్సహించాలి



శ్రీనివాసరావు, జోషిలను సత్కరిస్తున్న డేవిడ్‌రాజు, చిట్టిబాబు

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, జేపీ అండ్ స్వరాజ్, స్వరాంజలి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం జేపీ అండ్ స్వరాజ్ 35వ వార్షికోత్సవం, గాయకులు జోషి, శ్రీనివాసరావులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రతిభకు ప్రోత్సాహం ఇచ్చినప్పుడే కళాకారులు రాణిస్తారని పేర్కొన్నారు. జేపీ అండ్ స్వరాజ్ వ్యవస్థాపకుడు సంస్థ లక్ష్యాలను వివరించారు. గాయనీ గాయకులు రత్నకుమారి, అమలా రాణి, రేష్మ, సువర్ణలక్ష్మి, అనురాధ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. నిర్వాహకులు శ్రీనివాసరావు, జోషిలను ఆత్మీయంగా సత్కరించారు. చింతకాయల చిట్టిబాబు, ఆనంద్, వీరభద్రరావు, వెంకటపతి పాల్గొన్నారు.

వాహనదారులకు నాణ్యమైన ఆయిల్‌ను అందించాలి



పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: వాహనదారులకు నాణ్యమైన ఆయిల్‌ను అందిస్తూ వ్యాపారాన్ని దినదినాభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని విజయవాడ రోడ్డులో రావిచర్ల అడ్డరోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ పెట్రోలు బంకును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్టమర్లకు ఉత్తమ సేవలను అందించేందుకు బంకు యాజమాన్యం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బంకు యజమాని చెరుకూరి బ్రహ్మేశ్వరరావు, ఇండియన్ ఆయిల్ డివిజనల్ రిటైల్ సేల్స్ హెడ్ ఏవీ అనిల్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎ.శ్రీకాంత్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ ఎ.అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు లావు నాగవరప్రసాద్ పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల ఏర్పాటుకు దాతల వితరణ



దివ్యాంగుడికి సాయం అందజేస్తున్న జమీందారు సుధాకరరావు, దాతలు

మైలవరం: దాతల సహకారంతో దివ్యాంగుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకు నిధులు సేకరించి, లబ్ధిదారుకు మైలవరం జమీందారు, ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు సహకారంతో దాతలు నిధులు సేకరించి శుక్రవారం అందజేశారు. ఇబ్రహీంపట్నానికి చెందిన రేవళ్ల వెంకటేశ్వర్లు కర్నూలుకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. ఆర్వో మినరల్ వాటర్ తయారు చేసే కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇతను విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. ఈ సంఘటనలో రెండు కాళ్లు పోయాయి. భార్యాపిల్లలను పోషించుకోలేక అవస్థలు పడుతూ మరొకరి సాయంతో పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాను రాను ఇతరుల సహకారం కరువయ్యింది. రోబోటెక్ టెక్నాలజీతో కూడిన ఆటో పైలెట్ ఎలక్ట్రానిక్స్ లింబ్స్ కోసం దరఖాస్తు చేసుకోగా రూ. 4లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1.18 లక్షలు మంజూరైంది. కొంతమంది దాతల సహకారంతో మరో రూ. 1.12లక్షలు సమకూరాయి. ఇంకా రూ.90 వేలు కావాల్సి రావడంతో మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావును కలుసుకోగా ఆయన సహకారంతో దివ్యాంగుడికి అవసరమైన నిధుల కోసం తనతో పాటు మరి కొంతమంది ద్వారా నిధులు సేకరించారు. దివ్యాంగుడికి అందజేశారు.

విజయవంతంగా ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆడుదాం ఆంధ్రా, జన్ భాగిధారి, ఆరోగ్య రక్ష 2.0 వంటి ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజక్ట్స్) కేవీ సత్యవతి అధికారులు, సచివాలయ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు ఆమె శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జోనల్ అధికారులు, సచివాలయం సిబ్బందితో ఆయా ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా నిర్వహణపై సచివాలయం సిబ్బంది సమర్పిస్తున్న నివేదికపై చర్చించారు. క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య రక్ష 2.0 కార్యక్రమంపై సచివాలయం ఇచ్చిన నివేదికపై కూడా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్న నేపథ్యంలో అంబేడ్కర్ మార్గదర్శకాలను ప్రజలకు తెలియజెప్పేందుకు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రతి సచివాలయంలో ‘జన్ భాగిధారి’ కార్యక్రమాన్ని నిర్వహించాలని సచివాలయం సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.